శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

విశ్వావసు

శ్రావణ-భాద్రపదములు

సంపుటము ౫౪ సంచిక 3

దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స.

Journal of the Telugu Academy
KAKINADA

Vol. 54 Part 3

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

వ్యవస్థాపకులు:

శ్రీ జయంతి రామయ్యగారు

ప్రతిష్ఠాపకులు:

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యరావు బహద్దరు వారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు

ఉద్ధారకులు:

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరు వారు,
జమీందారు, ఉయ్యూరు ఎస్టేటు

శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

విశ్వావసు శ్రావణ భాద్రపద మాసములు.
సంపుటము 54. : : సంచిక 3.
సంపాదకుడు : శ్రీ కుందూరి ఈశ్వరదత్తు.

విషయ సూచిక

సంపాదకీయము

అపరిశోధితములు, అలభ్యములునగు ప్రాచీనాంధ్రకృతులను ప్రకటించు నుద్దేశముతో సారస్వతకృషి సల్పు పరిశోధకుల సహాయమున ఎడనెడ మా పత్రికయందట్టి కృతులఁ బ్రకటించుచున్నాము. ఈ సంచికయందు శ్రీ బిరుదరాజు రామరాజుగారు, శ్రీ బండారు తమ్మయ్యగారు పండితారాధ్యుని లఘుకృతుల సంపాదించి, పరిషత్పత్రికలోఁ బ్రచురించుట కవకాశమును గల్పించినందులకు వారికి మా కృతజ్ఞత. శ్రీ రామరాజుగారు వ్రాసినట్లు ఇట్టి కృతులెన్నియో మన ఆంధ్రప్రదేశమునందు ముఖ్యముగా తెలంగాణ ప్రాంతములందు లభింపఁగలవు.

రాజరాజు కోరుమిల్లి శాసనము

ఈ శాసనము ప్రతిబింబ సహితముగా కీర్తిశేషులు ఫ్లీటు (Dr Fleet) దొరగారు క్రీ. శ. 1885 సంవత్సరము ఇండియన్ ఆంటిక్వేరీ సంపుటము XIV లోఁ బ్రకటించియున్నారు. ఆసంపుటము సులభముగా లభ్యముకాదు. చరిత్ర సారస్వత పరిశోధకుల కుపయోగార్థము—ప్రకటింపఁబడినది

తాళపత్రగ్రంథ సేకరణము-ప్రభుత్వము

ప్రభుత్వమువా రట్టి గ్రంథముల సేకరించి, భద్రపఱచుటకు నిశ్చయించినారని పత్రికాప్రకటనలవల్లఁ దెలియుచున్నది. అట్టి ప్రతుల సేకరించినమాత్రాన కార్యసాఫల్యము కలుగదు. వానిని ప్రకటించవలసిన బాధ్యతయు నెంతేని కలదు.

ముద్రణ స్ఖాలిత్యములు

“పండితారాధ్యోదాహరణము” అనుటకు మారుగా “పండితాధ్యోహరణము”అను శీర్షిక వ్యాసముఖమునఁ బ్రకటింపఁబడినది. పండ్రెండవపుటలో “చెన్నబసవరగడ - శ్రీ బండారు తమ్మయ్యగారు” అను శీర్షిక వదలి చదువవలెనని ప్రార్థన.

గ్రంథసమీక్షకు వచ్చిన గ్రంథములు

1. కవిశిరోభూషణము.
2. రమణీయము - శ్రీ దువ్వూరి రమణశాస్త్రిగారు
3. వసుచరిత్రము - సంస్కృతము - కాలహస్తకవికృతము.
   సంపాదకులు- శ్రీ బిరుదరాజు రామరాజుగారు
4. గోడగూచి, గ్రంథకర్త-శ్రీ వేదాంతము కాశీనాథముగారు.
5. శ్రీ రామకృష్ణశతకము - గ్రంథకర్త - డి. గోపాలకృష్ణ.
6. విజయనగర సంస్థానము - ఆంధ్రవాఙ్మయ పోషణము
   గ్రంథకర్త - శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు.
7. సంక్రాంతి సంచిక.

పై గ్రంథముల సమీక్షలు రాబోవు సంచికలో వెలువడును.

పాల్కురికి సోమనాథుని పండితారాధ్యోహరణము

డా॥ బిరుదరాజు రామరాజు, ఎం. ఏ.
ఉస్మానియా విశ్వవిద్యాలయము.

మహాపండితుఁడును మహాకవియునగు పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, సోమనాథభాష్యము రుద్రభాష్యము మున్నగు బృహద్గ్రంథములే కాక పెక్కు లఘుకృతులు రచించినాఁడు. ఆలఘుకృతులలోఁ గొన్నింటిని శ్రీ బండారు తమ్మయ్యగారొక సంపుటమున నిటీవల ప్రకటించియున్నారు. పిడుపర్తి సోమనాథుఁడు పాల్కురికి సోమనాథుఁడు "ఉదాహరణ యుగ్మము" రచించినట్లు పేర్కొన్నాఁడు. సోమనాథుని బసవోదాహరణము తెలుగులోను సంస్కృతములోను లభించుటవలన ఇన్నాళ్ళు పండితలోకము ఉదాహరణ యుగ్మమనగా బసవోదాహరణ యుగ్మమనియే భావించినది. కరీమునగరము మండలమున నాకొక తాళపత్ర గ్రంథము లభించినది. దానిలో సోమనాథభాష్యముతో పాటు పాల్కురికి సోమనాథుఁడు రచించిన పెక్కు లఘుకృతులున్నవి. వానిలో నీ పండితారాధ్యోదాహరణ మొకటి. ఈకృతి యున్నట్లు ఇంతవరకు ఆంధ్రసాహిత్య ప్రపంచమునకు దెలియదు. తమ్మయ్యగారిసంపుటములో నిది చేరలేదు. మొదటి సారిగా దీనిని ప్రకటించు భాగ్యము కలిగినందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. వ్రాయసకాఁడు తాళపత్రగ్రంథము వ్రాసికొన్నది నందన సంవత్సర వైశాఖ బహుళ త్రయోదశి శుక్రవారము. ఇది క్రీ. శ. 3-5-1532 తేదికి సరిపోవుచున్నది. ఇతరాంధ్రప్రాంతములందువలెఁ దెలంగాణమునఁ దాళపత్రగ్రంథములను సేకరించుట భద్రపరచుట జరుగలేదు. ప్రభుత్వము వారేమాత్రము నీవిషయమున శ్రద్ధగొనలేదు. చిన్నచిన్న సంస్థలవద్ద కొందఱు వ్యక్తులవద్ద కొన్ని తాళపత్రగ్రంథములున్నవి. ఏయే మారుమూలలం దింకనెట్టి యనర్ఘరత్నములు మాటుమణఁగి యున్నవో తెలియదు. ఇరుగు పొరుగు రాష్ట్రములందు

ప్రాచ్యపరిశోధనాలయము లున్నవి. కేలకొలది తాళపత్రము లిప్పటికిని దెలంగాణమున లభించును. వాని నన్నింటిని ప్రోగుచేసి ఆంధ్రదేశ ప్రభుత్వమువారును మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము వంటిదాని నొకటి స్థాపించి పరిశోధనలు చేయించినఁ దెలుగు సంస్కృతికిని తెలుఁగు సాహిత్యమునకును మేలుచేసినవా రగుదురు. ఆలస్యము చేసినచో ఆతాళపత్రగ్రంథము లెక్కడివక్కడనే జీర్ణించిపోవును. అప్పుడు "నదీనాం సాగరో గతిః"

శ్రీ మల్లికార్జున పండితోదాహరణము :

ఇకనీ యుదాహరణమును జిత్తగింపుఁడు.

శ్లో. అద్వైతోద్ధత కుంభికుంభదళనోద్యన్నాద్రిపంచాననో
గర్వోదంచితపాంచరాత్ర నిబిడప్రాలేయ చండద్యుతిః,
పాషండాబ్జమహాగజో విజయతే బౌద్ధాద్రిఘోరాశనిః
శ్రీమత్పండిత మల్లికార్జునగురు ర్విద్వత్సభాపూజితః. ౧

శ్లో. పండితారాధ్యనామేతి పంచాక్షరసముద్భవమ్
సకృ[త్] స్మరంతి యే భక్తా స్తే జనాః పుణ్యకారిణః. ౨

మాలిని. శివకర శివసౌఖ్యా శిష్టభక్త్యేకముఖ్యా!
వివిధపరమశీలా వేదశాస్త్రానుపాలా!
ప్రవిమలపరభావా పండితారాధ్య దేవా!
తవిలి నిను భజింతున్ దక్షయుం బ్రస్తుతింతున్. 3

శా. శ్రీమన్ శైవపరమావరున్ [1]వినమిత శ్రీచెన్నమల్లేశ్వరున్
ధీమంతున్ నిగమాగమ శ్రుతిమతోద్గీతార్థవేత్తన్ బుధ
స్తోమస్థున్ బ్రభు నార్యనేతృఁడగు నాథ్యున్ బండితారాధ్యులన్
గామింతున్ నుతియింతుఁగొల్తుఁ దలఁతున్ గామ్యార్థసంసిద్ధికిన్ ౪

1. నియమిత.

—: ప్రథమా విభక్తి :—

శా. శ్రీమత్పండితమల్లికార్జునుఁడు వైశిష్ట్యోల్లసచ్చర్యుఁడు
ద్దామప్రోద్ధతవీరభక్తినిధి నిత్యశ్లోకుఁ డుద్యన్ముని
స్తోమస్తోత్రుఁ డగణ్యపుణ్యుఁ డతితేజోరాశి సమ్యగ్దయా
ధాముం డీవుత మాకు భక్తియుఁ బ్రసాదార్థక్రియాసక్తియున్ ౧

మధురగతిరగడ

కళిక:— [2]మఱి శుద్ధశైవమార్గమండనుఁడు
తులువణించు భవ • దుర్గఖండనుఁడు
చిరతరప్రణవ • సిద్ధమాంత్రికుఁడు
పరమభక్తి[3]విని • బద్ధతాంత్రికుఁడు
మునిగణ ప్రచయ• ముఖ్యవందితుఁడు
జనితచిన్మయసు • సౌఖ్యవందితుఁడు
అలఘుసంచితశి • వైక్యభావనుఁడు
ఎలమి సర్వజగ • దేకపావనుఁడు

ఉత్కళిక :—తన విభుత్వమును
ఘనమహత్త్వమును
ధరణి నింపుమని
హరుఁడు పంపఁబని
[4]వడసి చెన్నమర
నొడలు గొన్న పర
మముదయాతనుఁడు
దమితయాతనుఁడు.

---

2. మఱియు. 3. విసిత. 4. వడసెఁ

—: ద్వితీయా విభక్తి :—

శా. ఆర్యుం డై ప్రమథానుసారకలితుం డై వీరమాహేశ్వరా
చార్యుం డై వరభక్తిముక్తిపమహాత్మైక్యప్రదుం డై మహై
శ్వర్యుం డై భవరోగవైద్యుఁ డయి భాస్వన్మూర్తియై సద్గుణా
స్థైర్యుం డై చను మల్లికార్జును యథాశక్తిన్ బ్రశంసించెదన్ ౮

మధురగతిరగడ

కళిక:—మఱియును భువనస ♦ మాజస్తుత్యుని
నెఱసిన మహిమా ♦ స్పద పాండిత్యుని
అతిశయనుత బా ♦ హ్యాంతరశుద్ధుని
హితశివగణవిర ♦ హితజనబాద్ధుని
శివయోగసుఖ ♦ శ్రీసాన్నిధ్యుని
సవిశేషాఖిల ♦ జగదారాధ్యుని
సంచిత విమల ♦ జ్ఞానసముద్రుని
సంచితనరచ ♦ ర్యామృతరుద్రుని. ౯

ఉత్కళిక:— హారు నుపకరణము
లారసిన చరణము
లలగక పెఱికిన
యలుగుల నఱకిన
మన మహాదేవయ
కును కార్యున్ దయఁ
బడసిన వీరుని
జడతా దూరుని. ౧౦

5. జిన

—: తృతీయా విభక్తి :—

శా. ఆజ్ఞారాధనపాత్రుచే విధినిషేధాదిక్రియాసక్తుచే
నజ్ఞానాబ్ధివహిత్రుచేఁ బరమయోగానందుచే భక్తిస
మ్యజ్ఞానాశ్రయణీయుచే ననఘుచే మా పండితారాధ్యుచే
నాజ్ఞాసిద్ధియుఁ జిత్తశుద్ధియు సముద్యత్ప్రీతి నైఁ బొందెదన్. ౧౧

ద్విరదగతి రగడ

కళిక :- మఱియు భవిజనరహిత • మహిమైకశీలుచే
నురుపురాతనగణో • ద్యుక్తవాగ్జాలుచే
ప్రకటితాష్టాదశపు • రాణనిర్ణేతచే
సకలశాస్త్రార్థవి • జ్ఞానసంధాతచే
వేదాంతసిద్ధాంతవిషయప్రవర్తిచే
నాదిమార్గప్రతిష్ఠాచార్యమూర్తిచే
శివతత్త్వభావసంచితయోగమధనుచే
శివతత్త్వసారసంచితపుణ్యకథనుచే. ౧౨

ఉత్కళిక :- గురునాజ్ఞఁ దలమోఁచి
యరసి శ్రితులను జూచి
శివప్రసాదము గొనిన
భవము మఱి లేదనిన
దని జగంబులఁ జాటి
మును ప్రసాదము నాటి
చేసిన ప్రసిద్ధుచే
నా శుభసముద్రుచే. ౧౩

—: చతుర్థీ విభక్తి :—

శా. భక్తుం డీశ్వరుఁ డగ్రగణ్యుఁడు మహాభాగుండు తత్త్వార్థసం
యుక్తస్వాంతుఁడు దేశికోత్తముఁడు నిత్యోల్లాసవంతుండు వి
వ్యక్తుండంచు గుఱించి జంగమసముద్యత్పాదపద్మార్చనా
సక్తిన్ బేర్చెను మల్లికార్జునునకై సద్భక్తి నాఁటించెదన్. ౧౪

ద్విరదగతి రగడ

కళిక :- మఱియును బునర్జనన ♦ మరణదూరునకు నై
వఱలు నపగతభయా ♦ వరణ శరణునకు నై
గహనాంగసంగతవి ♦ కారదూరునకు నై
సహజైకయోగపరి ♦ చారధీరునకు నై
కమనీయభక్తిశృం ♦ గారపాత్రునకు నై
సముదితాంచితశివా ♦ చారపూర్ణునకు నై
అతులసంవిత్సుఖా ♦ యత్తచిత్తునకు నై
అతివినిర్మలమహో ♦ దాత్తవృత్తునకు నై ౧౫

ఉత్కళిక :- లింగార్చనావేళ
జంగమము సల్లీలఁ
(గడువడినిడనకడకు)
నడతేర శివపూజ
గాని భక్తుఁడే లింగ
మని భజించిన జంగ
మప్రాణపదునకై
విప్రసమ్మదునకై ౧౬

—: పంచమీ విభక్తి :—

శా. ఆఖ్యాతప్రమథానుకీర్తివలనన్ స్వాత్మావబోధోల్లస
త్సౌ(ఖ్యోపా)యజనప్రకాశువలనన్ శంభుప్రసాదాగమ
[6]వ్యాఖ్యాతాచరణప్రవీణమతి భాస్వత్పండితారాధ్యనా
మాఖ్యాతాచితపుణ్యమూర్తివలనన్ మా కిష్టముల్ చేకురున్ ౧౭

6. వ్యాఖ్యయా

శ్రీ మల్లికార్జున పండితారాధ్యోదాహరణము

(ద్విరదగతి రగడ)

కళిక :- మఱియు ననన్యశశివస ♦ మయ సముచితునివలన
గురుఁ బొనరుచుఁ దనరు ♦ గుణగణాయతువలన
శరణగణవరచరణ ♦ సరసిరుహాననువలన
సరస [7] వరమునినికర ♦ సతతనుతయశువలన
పరమపరవిమలతర ♦ పరమసుఖకరువలన
నిరతిశయదురితచయ ♦ నిఖిలభయహరువలన
శ్రుతినియతమతసహిత ♦ సుకచిరసహితువలన
వితతయమనియమసమ ♦ విలసచ్చరితువలన ౧౮

ఉత్కళిక :- శివుని పంపున వచ్చి
తవిలి కనుగవ నిచ్చి
ముమ్మాటికిని జడయు
నమ్మకున్నను దడియు
కడ నిడుదలగు కన్ను
లడరఁ బడసిన చెన్ను
నివుడు ధన్యునిఃలన
భువనమాన్యునివలన ౧౯

—: షష్ఠీ విభక్తి :—

శా. పాపాత్ముల్ వెలనాటిచోడనృపతిన్ భ్రాంత్యత్వతంగాధముల్
శాపోద్రేకవిజృంభితాగ్నిశిఖలన్ (జయ్యన్ వినాశంబుగాఁ
బాపోద్వేగఫలంబునప్పుడె గసన్) ధన్యంబుగా నుగ్రఁడై
యాపాదించిన మల్లికార్జునకి ట్లర్పింతు నా చిత్తమున్ ౨౦

7. శరక

తురగవల్గన రగడ

కళిక :- మఱియు మెఱయఁ జెప్పనొప్పు ♦ మహితనిహితవర్తనునకు
నెఱవు నిరవుఁ జూపనోపు ♦ నిత్యసత్యకీర్తనునకు
ప్రాపుదాపు దానయైన ♦ భక్తిముక్తికారణునకు
పాపకోపరాగరోగ ♦ భవనిచయనివారణునకు
సతతవితతకర్మమర్మ ♦ జాలమూలకృంతనునకు
సతివిహితవిచారసార ♦ సాంగలింగచింతనునకు
ఆద్యహృద్యరచితనిచిత ♦ యజనభజనమండితునకు
గద్యపద్యనవ్యకావ్య ♦ కథనమథన పండితునకు ౨౧

ఉత్కలిక :- ఇల సమస్తవాదవేద
ములఁ బ్రమాణజాలమూల
మున శివుండ మేటి పోటి
యని గుఱించి జ్ఞానహీన
సమయసమితిఁ ద్రుంచి చించి
యమితవిమలభక్తియుక్తిఁ
బరగు తత్త్వచేతనునకు
భరితభక్తిబీజమునకు ౨౨

—: సప్తమీ విభక్తి :—

శా. లింగాత్ముం ధవళేశు వామమున బల్మిన్ జేరి మారోత్కటన్ గ
ర్వాంగద్రోహిని బానుగఁటి యుదయద్వ్యాఘ్రేశుఁ దత్సంతతిన్
ద్రుంగంగా శపియించి మించి జగదుత్తుంగప్రతాపోదయా
త్సంగధ్వంసకు మల్లికార్జునునియం దాసక్తిమైఁ గొల్చెదన్ ౨౩

౮. దాంగీకారుఁడు

(మధురగతి రగడ)

కళిక :- మఱియును సజ్జన ♦ మండలునందుఁ
గొఱలు శ్రుతిస్మృతి ♦ కుండలునందుఁ
దురితసముత్కర ♦ దూరగునందుఁ
పరమపరాత్పర ♦ పారగునందుఁ
నరసజగజ్జన ♦ సన్నుతునందుఁ
ఉరుతరకీర్తిస ♦ మున్నతునందుఁ
పరిమితసూనృత ♦ భాషణునందుఁ
స్ఫురితదయారస ♦ భూషణునందుఁ ౨౮

ఉత్కళిక :- హరు కృపయాటల
కిరవగు చోటుల
కనువగు మాటల
వినుతుల తేటల
పదముల పాటల
ముదమగు నాటల
గల గురునందు
మలహరునందు. ౨౯

—: సంబోధన :—

శా. శాంతస్ఫూర్జితనందినాథ భవపాశచ్ఛేదనోగ్రాక్ష సి
ద్ధాంతప్రోద్ధతవాదగీతమయవిద్యాతీత భృంగీశదు
ర్వాంతోద్యద్బల వీరభద్ర నినునేఁ బ్రార్థింతు విజ్ఞాతవే
దాంతా! పండితమల్లికార్జున! త్రిలోకారాధ్య! రక్షిం [పుమా] ౩౦

(తురగవల్గన రగడ)

కళిక :- మఱియు సంయమీశ్వరోక్త ♦ మార్గసంతతప్రచార
మెఱయు హృదయకమలమధ్య ♦ మిళితశుద్ధతత్త్వపూర
దురితచరితజననమరణ ♦ దుఃఖసంకటాతిదూర
హారసమయసుఖార్థవర్ధ ♦ నాభికల్పితప్రకార
ప్రకటతరభవాంధకార ♦ పటలవిఘటనప్రదీప
సుకృతజనహితోపదేశ ♦ సులభసద్గురుస్వరూప
విస్మయాభిజననహేతు ♦ వీరభక్తియోగసార
అస్మదీయచెన్నమల్లికార్జునాపరావతార ౨౭

ఉత్కళిక :- అమర తనువు సత్క్రియాధ
రము ధనముగాని వేద
నము మనము భక్తిభావ
నమున సమయలింగసావ
ధానలీన పరమయోగ
మానితానురాగభోగ
జనితనిర్వికల్పసౌఖ్య
వినతనిఖిలశరణముఖ్య ౨౮

—: సార్వవిభక్తికము :—

శా॥ నీవార్యుండవు నినుసృజించు జగముల్ నీచే భవంబెందు నీ
వై వర్తిల్లు యశంబు నీవలన సౌఖ్యావాప్తి నీకుం బ్రసా
దావిష్కార సభోత్సవంబడుగు నీయం దావహింతున్ మదిన్.
దేవా! పండితమల్లికార్జున! జగద్దీపప్రభావోదయా! ౨౯

శా॥ ఆరూఢాంచితలింగజంగమ కృపాయత్త ప్రసాదోదయా
పారోక్తిన్ జనునీయుదాహరణముఁ బాల్కుర్కి సోముండు లో
కారాధ్యుండగు మల్లికార్జునకిట్లర్పించె సద్భక్తి నిం
డారంగాఁ బఠియించినన్ వినినఁ గామ్యార్థంబిలన్ జేకుఱున్. 30

చెన్నబసవరగడ

పాలుకురికి సోమనాథ మహాకవి కృతము.

శ్రీ బండారు తమ్మయ్యగారు.

మిత్రులు శ్రీ రామరాజుగారు సోమనాథునికృతులలో నప్రకటిత పూర్వము నలభ్యమునగు నీ యుదాహరణకృతిని సేకరించి ప్రకటించినందుకు మా ధన్యవాదములు. అర్థలక్షణములు సంగతములుగా లేక సందేహాస్పదములుగా నున్న కొలది తావు లందు నేనించుక సవరణలు చేసి వానికి 1, 2 మున్నగు గుఱుతులుంచి యసలు పాఠములను బుటలయందుగునఁ జూపితిని. అసలు ప్రతిలో లుప్తములవుటచే శ్రీ రామరాజుగారు .... గుఱుతులుంచిన తావులను నేను కథానుసందర్భమున కనుగుణముగా పూరించి కుండలీకరణములలోఁ జూపితిని. పద్యములక్రిందికళికలు ఛందోలక్షణ మనుసరించియే యే రగడలకు సరిపోవునో సూచించితిని. ఉత్కళికయనఁగా కళికలో నర్థభాగమని తెలియునగును.

ప్రథమావిభక్తి పద్యముక్రింది కళికను 5+3 ఎనిమిదేసి మాత్రలుగల రెండుభాగములుగాఁ గూర్చి కవి యెనిమిదవమాత్ర మీఁద యతిని చాటించినట్లు కాన్పించును. అందుచే నిది యుత్తమ పాదమునకుఁ బదునాఱుమాత్రలుగల మధురగతిరగడకు సరిపోవును. అసలు ప్రతిలోని పాఠములు 1, 4 పాదముల ప్రథమభాగములో నిందుకు సరిపడుటలేదు. అందుచే "మతియుశుద్ధ," "పరమ భక్తి వినీతి" అనువానిని "మతిశుద్ధ" "పరమవినీ" అని మార్చితిని.

ఇట్లు
బండారు తమ్మయ్య
పరిషదధ్యక్షుఁడు.

చెన్నబసవరగడ

(శ్రీ పాల్కురికి సోమనాథ మహాకవి కృతము)

కం. శ్రీ మంతన బసవగురు
శ్రీ మంతన వాంపాగర్వ జంగమలింగ
శ్రీ మంతన సుజ్ఞాన
శ్రీ మంతన [1] మహితభక్తి యింబసవేశా!

(ఉత్సవ రగడ) = తురగవల్గన రగడ.

శ్రీ బసవ వృషభకుమార వరకుమార — చెన్నబసవ
శ్రీ బసవ చిదనల హాతరమా కుమార ,,
బసవ గురువచోవ్యపగత వృజనపంక ,,
బసవ పురభిదపగత త్రిపుర కలంక ,,
బసవ పశుపవిదళిత పశుపాశ వరణ ,,
బసవ మలహరక్షపిత మల ప్రసరణ ,,
బసవ భానునిర్గళిత భవాంధకార ,,
బసవ వీరభద్ర వీరభద్రసార ,,
బసవ గురువరాఘరీకృతాధి శిష్య ,,
బసవ భావజనిత లింగసుకలి శిష్య ,,
బసవ విషయజప్రసాద [2] సౌఖ్యలోల ,,
బసవ పాదజనిత వినుత భక్తిశీల ,,
బసవ పాదమద గర్జైక పథకహార ,,
బసవ రుద్రగణ నిజాపరావతార ,,
బసవ మాంత్రికోపలబ్ధ రాజమంత్ర ,,
బసవ తాంత్రికోపదేశ వీరతంత్ర ,,
బసవ పద సరోజపూజ నాగ్రహస్త ,,
బసవ పద సరోజనత సమాజ [3] శస్త ,,

---

1 నాసమ 1 విషయ 3 హస్త

బసవ పదకమల పరాగ పటలాతింక — చెన్నబసవ
బసవ పద కమలనుతి ప్రహర్ష పులక — ,,
బసవ పద నఖాంశు కౌముదీచకోర — ,,
బసవ పాదనఖర ముకుర సుఖశరీర — ,,
బసవ పదరవింద గత మరందసిక్త — ,,
బసవ పదరవింద కాంత కాంతియుక్త — ,,
బసవ పాద తళిమ రాళ [4] జాలకల్ప — ,,
బసవ సద్గుణ స్మరణ చణావికల్ప — ,,
బసవ పాదకమల విమల సదనవాస — ,,
బసవ పాదభక్తి వాసనా విలాస — ,,
బసవ పదవిశేష భక్తి వేషభూష — ,,
బసవ పాదభక్తి పల్లవిత మనీష — ,,
బసవ పాద ఘననినాద వనమయూర — ,,
బసవ పాద కంజ పంజరోరుకీర — ,,
బసవ గీత జాత నీత [5] సారగర్భ — ,,
బసవ పారిజాత పోత కలితగర్భ — ,,
బసవ కల్ప మహిజ మూలికాదిసిద్ధ — ,,
బసవ కల్ప వల్లరీ వితాన బద్ధ — ,,
బసవ కల్ప భూరుహోరు చారుశాఖ — ,,
బసవ దివిజ భూజవర శిఖామయూఖ — ,,
బసవ కల్ప కుజనవాంకు [6] రానుకూల — ,,
బసవ కల్పవృక్ష పల్లవాంశు జాల — ,,
బసవ గురు మరుత్తరు ప్రచుర శలాటు — ,,
బసవ గురు మరుత్తరు ప్రసూనవలయ — ,,

---

4 కూళ 5 జపన 6 రయుతుశాల

బసవ కల్పపాద ఫల విఫలసార చెన్నబసవ
బసవ కామధుక్పయః ప్రివాహపూర ,,
బసవ ధుగ్యరస్త వాలవాల ,,
బసవ కామ ధుఙ్ముఖారవింద గంధ ,,
బసవ కామ ధుగ్వపుష్కలానుబంధ ,,
బసవ నిత్యపాపయః పయోధి ఫేన ,,
బసవ ఘన ఘృణావియన్నదీవిలీన ,,
బసవ రస రసాయనైక పాత్రి భూత ,,
బసవ నిధినిధానలబ్ధ భాగ్యజాత ,,
బసవ శాతకుంభకుధర కోటిరోచి ,,
బసవరోహణాచల ద్యుమణి మరీచి ,,
బసవ రజత శైల సార్వభౌమ భూమ ,,
బసవ హిమవదచల భూమి కాభిరామ ,,
బసవ కులనగాగ్రి [7] కనక కలశధామ ,,
బసవ దిగిభ దివ్యనిటల తటలలామ ,,
బసవ బహ్విధావవర్ణ బహుళశోభి ,,
బసవ సద్వితీయ వర్ణ సహజ తేజ ,,
బసవ సతృతీయ వర్ణ ముఖ్యసౌఖ్య ,,
బసవ తదసమాక్షర స్ఫురన్మనస్క ,,
బసవ తదసమాక్షరాంకల సదురస్క ,,
బసవ తద సమాక్షరోప మానగాన ,,
బసవ తద సమాక్షరామృత రసపాన ,,
బసవ తదసమాక్షర రమణీగణాకరండ ,,

7 కలన

బసవ తద సమాత్త రనిచితాబ్జ జాండ చెన్నబసవ
బసవ వర్ణలిఖిత పుస్తకైక రసన ,,
బసవ వర్ణ వస్తు పీఠికాంగ వసన ,,
బసవ వర్ణ కర్ణ పూర్ణ కుండలాంక ,,
బసవ వర్ణ సూత్రరత్న [8] శోభితాంగ ,,
బసవ లింగసేవనార్చ నావిధేయ ,,
బసవ జంగమాంఘ్రి పూజనానపాయ ,,
బసవ సద్గురుప్రసాద భరితపాత్ర ,,
బసవ నిజగుణ ప్రసాద కర్ణసూత్రి ,,
బసవ తదుభయ ప్రసాదఘ్రాణవిషయ ,,
బసవ సుప్రసాద రస విషయరసజ్ఞ ,,
బసవ సుప్రసాద సంస్కరణ మనోజ్ఞ ,,
బసవ సుప్రసాద విషయ సర్వసంగ ,,
బసవ సుప్రసాద [9]లసదపాంగసంగ ,,
బసవ పాద కంకణాంకితోత్తమాంగ ,,
బసవ మజ్జనోదకస్నపిత తదంగ ,,
బసవ ప్రసాద లీలపూర్ణకుంభ ,,
బసవ సర్వవిభవ సౌఖ్యవిషయకుంభ ,,
బసవ గురుపదీయ గురుతరాధ్వపథిక ,,
బసవలింగ భక్తలింగ సుగుణకథక ,,
బసవ సశివపాదభక్త పాదభక్త ,,
బసవ సత్యశరణయుక్తపదనియుక్త ,,
బసవ కేవల ప్రసాద సుప్రసాద ,,
బసవ నిజశివైక్య వ్రతి శివైక్యమోద ,,

---

8 చోడికాంక 9 లసదు

బసవ వృత్త బసవచిత్త బసవసత్త చెన్నబస
బసవ సూక్త బసవశక్త బసవయుక్త ,,
బసవ నిరత బసవ చరిత బసవభరిత ,,
బసవ కామ్య బసవగమ్య బసవసౌమ్య ,,
బసవ నామ బసవసీమ బసవనేమ ,,
బసవ పుత్రి బసవసూత్రి బసవగాత్రి ,,
బసవ పుత్రి నిమ్మపుత్రి నానలయ్య ,,
బసవ గోత్రి నిమ్మగోత్రి నానలయ్య ,,
బసవ భృత్య నిమ్మభృత్య నానలయ్య ,,
బసవ భక్త నిమ్మభక్త నానలయ్య ,,
బసవ శిష్య నిమ్మశిష్య నానలయ్య ,,
బసవ భావ నామభావ కావుదెన్న ,,
బసవ సేవ సత్రిభావ కావుదెన్న ,,
బసవ లక్షశైకరక్ష రక్షిసెన్న ,,
బసవ రక్షితా సమాక్ష రక్షిసెన్న ,,
బసవ లోల లరసులీల పాలిసెన్న ,,
బసవ మేళ నాతిశీల పాలిసెన్న ,,
బసవ చిత్సముద్రి ఉద్ధరి సువుదెన్న ,,
బసవ సత్ప్రిబుద్ధి ఉద్ధరి సువుదెన్న ,,
బసవ కరణ నిహితకరణ కరుణిసెన్న ,,
బసవ కరణ దేహావరణ కరుణిసెన్న ,,
బసవ చరణ నిమ్మచరణ శరణరెనగె ,,
బసవ చరణ నిమ్మచరణ హరణరెనగె ,,
బసవ మూర్తి చెన్నబసవ లసితకీర్తి ,,
బసవ సూను చెన్నబసవ ఘకలూన ,,

బసవ సిద్ధ చెన్నబసవ బసవసిద్ధ చెన్నబసవ
బసవ పురుష చెన్నబసవ బసవపురుష ,,
బసవ రూప చెన్నబసవ బసవజాప ,,
బసవ గోప చెన్నబసవ భక్తిదీప ,,
బసవ గణ్య చెన్నబసవ బహుళపుణ్య ,,
బసవ శరణు చెన్నబసవ నిమ్మశరణు ,,
బసవ దీశద శరణు చెన్నబసవ శరణు ,,

కం. చెన్నబసవణ బల్లల

బణ్ణిపలా బసవ మహిమెయం బల్లనవం
చెన్నబసవణ భక్తియు
నిన్నొబ్బిరి...బసవేశా !

కం. ....చెన్నబసవ
స్తుతి మహోత్సాహా జగశియం పొగసిదొడం
స్తుతిసిదొడికేళి దొడమభి
మత లిసువడు చెన్నబసవం బసవం!

చెన్నబసవేశ్వరుఁడు వీరశైవమతోద్ధారకుఁడును బసవేశ్వరుని మేనల్లుడు చెన్నబసవేశ్వరుఁడు కుమారస్వామి యవతారమని వీరశైవుల విశ్వాసము. సోమనాథుని లఘుకృతులలోని ఈచెన్నబసవ రగడ యాతని శిష్యుడైన పిడపర్తి సోమనాథకవి పద్యములు బసవపురాణావతారికయందలి పద్యములలో నుదాహృతములయిన వానిలోఁ జేరి యుండలేదు. ఇదియు సోమనాథవిరచితమే యనుటకు సందియము లేదు.

నామితుల్లు మహబూబు నగరోన్నత పాఠశాలా పండితులగు శ్రీహన్నబాదా నాగలింగ శివయోగిగారి తాళపత్రగ్రంథ సం

చయమునుండి సేకరించి దీనినిందు బ్రకటించుచున్నాను. ఇది మూడే
మాత్రలుగల 8 గణములతో మొత్తమిరువదినాల్గు మాత్రలు గలి
కన్నడమందలి యుత్సవరగడకు, తెలుగునందలి తురగవల్గనరగ
లక్షణమునకు సరిపోవుచున్నది. అర్థము సంగతముగను సులభముగన
ద్యోతకముకాని కొలఁదితావులలో నేను గొన్నిసవరణలుచేసి యసల
ప్రతియందలి వానిమూలపాఠములను బుటలయడుగునఁ జూపితిని

బండారు తమ్మయ్య,
పరిషదధ్యక్షుఁడు.

లక్షణసార సంగ్రహము

శ్రీ చేకుమళ్ల కామేశ్వరరావు, బి. ఏ., బి. ఇడి.

లింగమగుంట తిమ్మకవి రచించిన లక్షణసారసంగ్రహమను పేరుగల సులక్షణసారము యొక్క తాళపత్రప్రతి దొరికిన విధమును మొదటఁగొంత చెప్పవలసియున్నది. గుడియాత్తములో నొకరి వద్ద నొకచిన్నతాళపత్రముల కట్టయున్నదని విని యతని నొకయేఁడాదిగా వేడితిని. ఎట్టకేలకు దానిని నాకతఁడిచ్చెను. అతనికి నాతాటాకుల కట్టలో నేమి కలదో తెలియదు. కాని దానిని నాచేతఁబెట్టిన మఱుక్షణమునుండి, తిరిగి యిచ్చివేయుమని ప్రాణముఁ దీసినాఁడు. అంతట వానిలో ముఖ్యమైన వానిని గ్రహించి తక్కిన తుకుకను వానికి నిచ్చివేసితిని. తనకట్ట తనకుఁ జేరినదని బ్రహ్మానంద భరితుఁడైనాఁడు. నాకునిచ్చునప్పటికె వాని కట్టలోఁ గొన్నిటి నెలుకలు, పురుగులు కొట్టివేసినవి. తక్కినవాని గతికూడ నంతియే. ఇట్టికారణములచే నతఁడు తనపేరు నిప్పట్టునఁ బ్రకటింపఁబడు భాగ్యమునఁ గోల్పోయినాఁడు.

నేను చేఁజిక్కించుకొన్న కట్టలో సులక్షణసార భాగమేగాక, కవిరాజు వేంకటరాజు అను నతని సూర్యచ్ఛందము- దీనికి మొదలు లేదు-కవిగజాంకుశము; కవివాగ్బంధము గలవు. వీనిలో సూర్యచ్ఛందము క్రొత్తగ్రంథము.

నేను 1921 లో వెలకుఁదెప్పించిన సులక్షణసారము మీఁద వెల్లంకి తాతంభట్టు రచితమనియే కలదు. అదినిజముగా విచారింపఁదగిన విషయము. ఏలయన, శ్రీకందుకూరి వీరేశలింగముగారు 1899 లో నచ్చువేసిన కవుల చరిత్రములో సులక్షణసారము తిమ్మకవి కృతమని స్పష్టముగా వ్రాసినారు. వావిళ్లవారటు పిమ్మటనైనను దాము చేసినలోపమును గ్రహించి సవరించుకొన్నారు. నే నీ లక్షణ గ్రంథభాగమును సవరించుటలో వావిళ్ళవారు 195[illegible] లో నచ్చువేసిన

సులక్షణసారమునుండియే అధోజ్ఞాపికలలో నెల్లెడలనుఁ బద్యసంఖ్యలఁ జూపినాను.

లింగమగుంట తిమ్మకవి కవిపండిత వంశమునకుఁ జెందిన వాఁడు. నెల్లూరు జిల్లాలోని గుండ్లకమ్మ (కుండికానది) యేటితీరమున లింగమగుంట గ్రామమున్నది. ఇందువసించుటచే నీవంశము వారికి లింగమగుంట యింటిపేరైనది. వీరివంశ వృక్షము —

యాజ్ఞవల్క్యశాఖ — కాశ్యపస గోత్రము
|
లింగమగుంట చెన్నయమంత్రి
|
శ్రీరామమంత్రి
|
అన్నప్ప (కమలమ్మ)
|
(1) సర్వకవి (భాగీరథి) | తిమ్మన | కాదన | కసవన

(1) సర్వకవి (భాగీరథి)
|
బసవన | రామ (నాగమ) | లక్ష్మణ

రామ (నాగమ)
|
పేరయ | మాచయ | (2) రామకవి | (3) తిమ్మకవి

(రామకవి వ్రాసిన చతుర్వాటికా మాహాత్మ్యములోని తిమ్మకవి వ్రాసిన సులక్షణసారములోని వంశవర్ణన పద్యములనుండి పై వంశవృక్షము వ్రాయఁబడినది. రెండు పుస్తకములలోఁ జెప్పఁబడిన వానిలో స్వల్ప భేదములు లేకపోలేదు. రామకవి తన తండ్రిపేరు,

రామయని చెప్పగా, తిమ్మకవి లక్ష్మణ యని చెప్పినాఁడు. మొత్తము మీఁద నివి విశేష ప్రమోదకరమైన భేదములై, సిద్ధాంతములను దాఱుమాఱుచేయునవి గాకుండుటచేఁ బ్రస్తుతము విడువబడినవి.)

పై వంశములోని వారిలో -

(1) పర్వతకవి కవిసార్వభౌముఁడని వర్ణింపఁబడినాఁడు. ఇతఁడు క్రీ. శ. 1500 ప్రాంతపువాఁడు కావచ్చును. రచించిన గ్రంథము లేవో తెలియవు.

(2) రామకవి క్రీ. శ. 1550 ప్రాంతపువాఁడు కావచ్చును. ఆనందకానన మాహాత్మ్యము, చతుర్వాటికా మాహాత్మ్యము, వేంకట మాహాత్మ్యము, మత్స్యపురాణము, వామనపురాణమునను గ్రంథములను రచించెను. వీనిలోఁ జివరి మూఁడు లభించుటలేదు. ఇతఁడు సుప్రసిద్ధకవియైన తెనాలి రామలింగని యల్లుఁడు.

(3) తిమ్మకవి క్రీ. శ. 1560 ప్రాంతపువాఁడు. అన్నదమ్ము లిరువురునుఁ జక్కంభట్టరుయొక్క శిష్యులు. ఇతఁడు రామభక్తుఁడు. తిమ్మన సులక్షణసారమును రచించెను. బాలబోధయను మఱియొక లక్షణగ్రంథమునకుఁగూడఁ గర్తయని పండితులుగొందఱు చెప్పు చున్నారు. దీనిని గుఱించి కొంచె మిక్కడ వివరించెదను.

“బాలబోధ ఛందస్సుకర్తపేరెఱుంగరాదు. అందు బహు ప్రాచీన గ్రంథము లుదాహృతములయ్యెను. ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ గొంత, మానవల్లి రామకృష్ణకవిగారి దగ్గఱఁగొంతకలద”ని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పిరి. మానవల్లి రామకృష్ణకవిగారు దీనికి బాలబోధమనియు, కవిసంజీవినియనియు సందిగ్ధనామములుగల వని వ్రాసియున్నారు. “లింగమగుంట తిమ్మన బాలబోధచ్ఛందస్సును వ్రాసినట్లు పాకనాటియందుగల కొలూరి యాంజనేయ కవి తనసుకవి కర్ణామృతమను లక్షణ గ్రంథమున నుడివియున్నా”

డని శ్రీ నిడదవోలు వేంకటరావుగారు వ్రాసియున్నారు.* ఈలక్షణ గ్రంథమింతవఱకు ముద్రణ భాగ్యమును నోచుకొనలేదు గాన దీనిని గుఱించి యధికముగాఁ జెప్పుటకు వీలు లేదు.

లక్షణ గ్రంథములలో కల్ల లింగమగుంట తిమ్మన వ్రాసిన సులక్షణసారమునకు మిక్కిలి జనత (పాప్యులారిటి) గలదు. కాని యాజనతయంతయు గణములు, యతులు, ప్రాసలు దెలుపు భాగమునకే, కాని మిగత దానికిఁగాదు. కావున నాగణాదుల భాగమే క్రీ. శ. 1862 లో ముద్రణకెక్కినది.

సులక్షణ సారములోఁ గొంతభాగమే యచ్చున కెక్కినదని ముద్రాపకులు, పండితులు క్రమక్రమముగా గ్రహించిరి. మిగత భాగమునకై కొందఱు శ్రమపడినారు. కాని లాభించలేదు. ఇతర గ్రంథములలో నుదహరింపఁబడిన పద్యములను మాత్రమే యొకచోటఁ జేర్చి తృప్తినొందవలసివచ్చినది.

శ్రీ వీరేశలింగముగారు తమ కవులచరిత్రలోఁ జెప్పిన సులక్షణసారము చిన్నది కాదు. వారి కంటఁబడిన పుస్తకము పెద్దదియే. కాని యదియేలకో యచ్చునకు రాలేదు. దానిగతియేమైనదో కూడ తెలియదు. ఇప్పుడు నాకుదొరకిన పుస్తక భాగములో వారుదాహరించిన కవుల పేరులు, పద్యములు చాలవఱకు గలవు.

నాకు దొరకిన పుస్తకములోఁ దిమ్మకవి తన వంశాదికమును గుఱించి చెప్పికొన్న పద్యములకుఁ బిమ్మట నక్షరముల, గణముల యొక్క యాధ్యాత్మిక పరిభావము (స్పిరిచ్యువాలిటి) గలదు. ఈమాత్రము గ్రంథమైనను లభించినదే!

నాకులభించిన పుస్తకము లింగమగుంట తిమ్మన రచించిన సులక్షణసార మానా, కాదా యను ప్రశ్నయుత్తరమును గోరు

---

* చాగంటి శేషయ్యగారి యాంధ్రకవి తరంగిణి సం 9. పుట 185.

చున్నది. అట్టిప్రశ్నకుఁదగిన కారణము లేకపోలేదు. సాధారణముగా శాస్త్రగ్రంథములలో ననేక ముఖ్యకవుల గ్రంథములనుండి భాగముల నెత్తి యొకచోట వ్రాసికొను నాచారముగలదు. ఇట్టివి సంకలన గ్రంథములు. నాకు లభించిన పుస్తకము గూడ నొక సంకలన గ్రంథమే నా?

తిమ్మకవి తనవంశాదికమును గుఱించి చెప్పుకొన్న మీఁదట గ్రంథరచనకుఁ దొడంగినాఁడు. ఈగ్రంథములో నున్న పద్యములే మిగత లక్షణగ్రంథములలోఁ దిమ్మకవి గ్రంథములోనివి యని యుదాహరింపఁబడినవి. సులక్షణసారములోనివని వీరేశలింగముగారు తమ కవులచరిత్రలో నెత్తిచూపించిన కవుల నామములు, పద్యములు నాగ్రంథములోఁగలవు. తిమ్మకవి క్రీ. శ. 1560 ప్రాంతపువాఁడు. ఈగ్రంథభాగములో నుదాహరింపఁబడిన కవుల, నామములు గ్రంథములు క్రీ. శ. 1560 కి పూర్వపువెగాని తర్వాతివి కాఁజాలవు కదా! కావున నిది సులక్షణసార భాగమేగాని వేఱొండుకాదని ఖండితముగాఁ జెప్పవచ్చును. ఈభాగమొక పూర్తిప్రకరణమైనను గాకుండుటచే, ఇది గద్యకైనను నోచుకొనలేదు.

లింగముగుంట తిమ్మకవికాలమును గుఱించివాదోపవాదములు లేవు. ఇతఁడు క్రీ. శ. 1560 ప్రాంతపువాఁడనియె పెక్కుమంది యుద్దేశము. ఇతనికిఁగొంచెముగా ముందువెనుకలనున్న లక్షణకవుల నామములనుఁ దెలిసికొనవచ్చును.

వెల్లంకి తాతంభట్టు	క్రీ. శ. 1480 ప్రాంతము
చిత్రకవి పెద్దన్న	,, 1550 ,,
ముద్దరాజు రామన	,, 1550 ,,
లింగముగుంట తిమ్మకవి	,, 1560 ,,

తిమ్మకవి వ్రాసిన లక్షణగ్రంథమునకు సులక్షణసారమను, పేరొక్కటియె గలదా, లేక మఱియొక పేరు గూడ నున్నదా? నాకు దొరకిన తాళపత్రప్రతిలో ప్రారంభ పద్యమునకు మున్ను లక్షణ సార సంగ్రహమనియే కలదు, కాని వేఱొక్కటి లేదు. కావున దీని ముఖ్యనామము లక్షణసారసంగ్రహమనియు, సులక్షణసారమనునది రెండవ పేరనియు గ్రహింపవచ్చును. ఈపుస్తకముయొక్క అసలుపేరు లక్షణసార సంగ్రహమని దెలియక పోవుటచేఁ బెక్కు చిక్కు లేర్పడినవి.

తిమ్మకవి కంటె నించుక పూర్వుఁడైన చిత్రకవి పెద్దన్న యొక లక్షణసారసంగ్రహమును రచించియున్నాఁడు. ఇట్లు వీరిరువురు రచించిన గ్రంథములకు నొకే పేరుండుటచేఁ జిక్కులు ప్రాప్తించుటలో చిత్రము లేదు. కాఁబట్టి దీని రెండవ పేరైన సులక్షణసారము ప్రచా రములోనికి వచ్చినది.

మానవల్లి రామకృష్ణకవిగారు కొన్నిచోట్ల లక్షణసార సంగ్రహమనియు, దానికర్త పెద్దన్న లేక చిత్రకవి పెద్దనయనియుఁ జెప్పుచు, నందుహరింపఁబడిన కవులను, కావ్యములను, గుఱించి చెప్పిరి. చిత్రకవి పెద్దన్న వ్రాసిన లక్షణసార సంగ్రహము మనకు లభించినది; ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించిరి. కాని మానవల్లి రామకృష్ణకవిగారు చెప్పిన కవుల నామములు గ్రంథములు నందు మచ్చునకైనఁ గన్పింపవు. లక్షణసారసంగ్రహమును చిత్రకవి పెద్దన వ్రాసెనను విషయ మెఱిఁగిన రామకృష్ణకవిగారికి మొదలు తుదలు లేని లక్షణసారసంగ్రహ ప్రతియొకటియో లభింపఁగా, దానిని వారు చూచి యది చిత్రకవి పెద్దన రచించిన గ్రంథముగా భావించి, పైవిధముగా వ్రాసియున్నారనియు, వారికి దొరికినప్రతి పెద్దన విర చితము కాదనియు, నిప్పుడు స్పష్టమగుచున్నది. తిమ్మకవిమాత్రమే

తన లక్షణసారసంగ్రహములో నితరకవులను, కావ్యముల నెన్నింటి నైన నుదాహరించియున్నాఁడు. పెద్దనయట్టిపనినిఁ దలపెట్టలేదు. కాబట్టి యుదాహృత పద్యములుగల పెద్దపుస్తకమేదో పెద్దనవ్రాసినది గలదని మనము భావింపనక్కఱలేదు. పెద్దన తనగ్రంథమున లక్ష్యములనన్నిఁటినిఁ దానేవ్రాయుటచేతఁగాఁబోలు తిమ్మన యితరుల లక్ష్యములను జూపుపుస్తకమును వ్రాయుటకు దొరకొని, దానికిఁగూడ నదియేపేరుఁబెట్టినాఁడు. పెద్దన తిమ్మనలు వ్రాసిన పుస్తకముల పేరొక్కటియే యగుటచేత నింతగజిబిజిపుట్టినది. తిమ్మన తనపుస్తకమునకు లక్షణసారసంగ్రహమని పేరు పెట్టుకొని, దానిని మంచిలక్షణసారముగాఁ జేసెదనని ప్రతిజ్ఞ చేసినాఁడు.

క. లక్షణశాస్త్రము లెల్లఁ బ
రీక్షించుటఁ గొంతకొంత యెఱిఁగిన వాఁడన్
లాక్షిణికా నుగ్రహతను
లక్షణసారం బొనర్తు లక్ష్యము లమరన్.

పుస్తకతత్త్వమును దెల్పుచూటయే తర్వాత దానికిఁ జేరె వెలసినది. పేర్లలోని గజిబిజిని లోకులు సులక్షణసారమును పేరిడి తీర్చినారు.

లక్షణసారసంగ్రహమను మఱియొక A Triennial catalogue of Manuscripts 1913-14 to 1915-16. R No. 235 పుట 691 పుస్తకమున్నది. ఇది సంకలన గ్రంథము. కూర్పరిపేరు దంతి యప్పకవియని భావింపబడు చున్నది. ఇది సమగ్రముగానున్నది. దీనిలో సులక్షణసారము, కవి జనాశ్రయము. అనంతచ్ఛందము, వాదాంగచూడామణి, కవిసర్ప గారుడము మున్నగు గ్రంథముల భాగములుగలవు. ఇందలి ప్రారంభ పద్యము సులక్షణసార పద్యముకంటె వేఱుగానున్నది. ఇది తిమ్మకవి కృతమగు సులక్షణసారముకంటె వేఱు.

లక్షణసారసంగ్రహమను నామమునకు ముందొకపదమునుం జేర్చి పేరుమార్చిన లక్షణశాస్త్రజ్ఞులు గొందఱున్నారు. కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమును, ఉప్పులూరి వేంకటరెడ్డి సకల లక్షణసారసంగ్రహమును గూర్చిరి.

తిమ్మకవికృత లక్షణసార సంగ్రహము కొంత చిత్రముగా నున్నది. సంస్కృత గ్రంథములనుండియు, తెలుఁగు పుస్తకముల నుండియు నుద్ధృతముల నెత్తి కనఁబఱచుటయే గాక గ్రంథాదుల నామాదులను సంస్కృత భాషలోనే యిట్లు తెలియఁజేసినాఁడు. ఉదాహరణములు:—

'ఆంధ్రి భాషాయామ్- అథర్వణఛందసి' 'కవి సర్పగారుడే' 'మగణస్య' ఇత్యాదులు.

ఇట్లు కవి తనకుఁగల సంస్కృతభాషాభి మానమును వెల్లడి చేసికొన్నాఁడు. లేఖకుల ప్రమాదము వలననే అక్కడక్కడ నట్టి సందర్భములలోఁ దెలుఁగు పదములు దొర్లినవి. అట్టివానిని నేను మార్చలేదు.

లక్షణగ్రంథములను రచించుటలోఁ బ్రాచీను లొక్కొక్క రొక్క పద్ధతినవలంబించినట్లు తోఁచుచున్నది. కొందఱు అక్షరాదుల యాధ్యాత్మిక ప్రభావము (స్పిరిచ్యుయాలిటి-)నకుఁ బ్రాముఖ్యము నిచ్చి రచించినారు-కవివాగ్బంధము, కవిరాజగజాంకుశమునిట్టివియే మఱియుఁ గొందఱు గణయతి ప్రాసవృత్తాదులను బ్రధానముగా నెంచినారు- అనంతుని ఛందస్సు, ముద్దరాజు రామనకవిసంజీవిని, మొదలగునవి. ఇంకను గొందఱు వ్యాకరణాద్యలంకారములఁగూడ నదనముగా జేర్చినారు- కావ్యాలంకారచూడామణి, అప్పకవీయము వంటివి.

ఇప్పుడు దొరకిన యీసులక్షణసార భాగములో నక్షరగణా దుల దివ్యత్వము దెల్పఁబడినది. తిమ్మకవి వ్రాసిన పూర్తిగ్రంథ మెట్లుండునో మనమూహించు కొనుటకుఁగూడ నొక చక్కని మార్గ మున్నది. ఈకవిగ్రంథమును సన్నిహితముగా ననుసరించి గ్రంథరచన చేసినవాఁడు కస్తూరిరంగకవి. అతని గ్రంథము పేరు ఆనందరంగ రాట్ఛందము. ఏసులక్షణసారము పోయినను కస్తూరిరంగకవి గ్రంథము మిగిలిన యెడల సులక్షణసారము నూటికిఁదొంబది పాళ్లు మిగిలిన దనియే చెప్పవచ్చును. కాఁబట్టి మనకు దొరకవిభాగము రంగకవి యొక్క ఆనందరంగ రాట్ఛందములోని తక్కినభాగమువలె నుండునని యూహింపవచ్చును.

లక్షణసారసంగ్రహములో ననేక కవులనామములు కావ్యములు నుద్ధరింపబడినవి. వాని నిక్కడ సంస్కృతమునకును, దెలుఁగు నకును వేఱువేఱుగా వర్గీకరించిచూపెదను.

సంస్కృత లక్షణ గ్రంథములు

1 అలంకార చూడామణి
2 అలంకార సంగ్రహము
3 కవికంఠపాశము
4 కవిరాక్షసుఁడు.
5 గోకర్ణఛ్ఛందస్సు (ఋషి ప్రోక్తే)
6 చమత్కార చంద్రిక
7 నానాలంకారము
8 లక్షణాదినికాయము (వీరాద్యుడు)
9 వృత్తరత్నాకరము (కేదారకవి)
10 సాహిత్యచంద్రోదయము
11 సాహిత్య చూడామణి
12 సాహిత్య రత్నాలయము
13 సాహిత్య రత్నాకరము

సంస్కృతోదాహృత గ్రంథములు

1 అమరుకము
2 ఉత్తరరామాయణము
3 ఏకావళి
4 కాలనిధానము
5 కుమార సంభవము (కాళిదాసు)
6 కుసుమాయుధ వ్యాకరణము.
7 కృష్ణజయము (కృష్ణభట్టు)

8 కేదారకవి
(వృత్తరత్నాకరమా?)
9 గణితశాస్త్రము
10 ఛప్పన్నము
11 తర్కభాష
12 నలోదయము
13 భారవి
14 భోజరాజీయము
15 మంత్రిదర్పణము
((శంకరాచార్యులు)
16 మణిదర్పణము
17 మాఘము
18 రఘువంశము
19 వామనశకునము
20 శివభద్రము
21 శ్యామలా దండకము
22 సార్వభౌమకవి
23 సాహసాంకము
(శృఙ్గధరాచార్యులు)
24 సూర్యసిద్ధాంతము.

ఆంధ్ర లక్షణగ్రంథములు

1 అధర్వణ ఛందస్సు
2 అనంతుని ఛందస్సు
3 ఉత్తమగండ ఛందస్సు
4 కవిరాజగజాంకుశము
5 కవి సర్పగారుడము
6 కావ్య చింతామణి
(తాతంభట్టు)
7 కావ్యాలంకారచూడామణి
(విన్నకోట పెద్దరాజు)
8 గోకర్ణచ్ఛందము
9 వాదాంగచూడామణి
10 విశ్వేశ్వరచ్ఛందము
11 వేములవాడ భీమకవి
(పుస్తకము పేరు లేదు)
12 శ్రీధరచ్ఛందస్సు.

ఆంధ్రోదాహృతగ్రంథము

1 అరణ్యపర్వము
(ప్రబంధ పరమేశ్వరుఁడు)
2 ఆదిపర్వము
(శబ్దశాసనుఁడు)
3 కల్పవల్లరి
4 త్రిస్థలిదండకము
(నంది తిమ్మన)
5 ద్వితీయ స్కంధము
(భాగవతము)
6 యుద్ధకాండము
(రామాయణము)
7 విరాటపర్వము
(ఉభయకవిమిత్రుఁడు)
8 శరభాంకుఁడు

పైవానిలోఁ గొన్ని నూతనములు. కల్పవల్లరి క్రొత్త పేరు. సర్వత్రిహాదాంగచూడామణి యనియే పేరుగలదు; పాదాంగచూడామణి మొదలగు పేరుమార్పులతోఁ గానరాదు. ఇది మల్లన్న కృతమని యితరలక్షణ గ్రంథములనుండి దెలియుచున్నది.

కవిరాజగజాంకుశము పేరొకతూరియైనఁ జెప్పఁబడినదిగాని కవివాగ్బంధము పేరు స్పృశింపఁబడనైనలేదు. కాఁబట్టి తిక్కన సోమయాజికృతమని చెప్పబడెను నీగ్రంథము నిజముగా తిక్కనదిగాక అతని పేరున వేరెవరో కూర్చినదని దృఢముగ జెప్పవచ్చును భీమకవి యాది కవిగాఁ బేర్కొనఁబడినాఁడు. అతని పుస్తకము పేరు మాత్రము చెప్పఁబడలేదు. అట్లే రేచని పేరెత్తఁబడలేదు. అటులే కవిజనాశ్రయము పేరు గూడలేదు. ఇందుఁ బేర్కొనఁబడిన లక్షణ గ్రంథములలోఁ గొన్ని ఇతర లక్షణగ్రంథములలో మాత్రమె గుర్తింపఁబడుచున్నవి; విడిగ్రంథములు దొరకుటలేదు, పై జెప్పఁబడిన గ్రంథములలో, మనకుఁదెలిసినంతమట్టుకు నొకటిఁ గూడ క్రీ.శ. 1550 దాఁటివచ్చునది లేదను విషయమును గుర్తింపవచ్చును.

ఈలక్షణసార సంగ్రహమును కస్తూరిరంగకవి జాలవఱకు ననుసరించినాఁడని ముందే చెప్పియుంటిని. కాని కేవలము గ్రుడ్డిగానను కరించలేదు. ఒక్కొక్కయెడమూలములోని యంశములను విడిచిపెట్టినాఁడు. ఒక పెద్దభేదమునుఁ జెప్పెదను. తిమ్మకవి యక్షరమాలలోని యేఁబదియక్షరములయొక్క తాత్త్వక పరిభావము నేఁబదిపద్యములలో వ్రాసినాఁడు. ఇవిచాలవఱకు సంస్కృతమునకుఁ దెలుఁగే. సంస్కృతములో దీనిని పాణిని వ్రాసినాఁడని కవిరాజు వేంకటరాజకృతసూర్యచ్ఛందమునుండి తెలియుచున్నది. ఆయేఁబదిపద్యముల

లోని భావమును రంగకవి రెండుమూఁడు పద్యములలోఁ జక్కఁగ నిమిర్చినాఁడు. కాబట్టి రంగకవి కొన్నిపట్టులలోఁ గొంతస్వతంత్రించి నాఁడని చెప్పవలసియున్నది.

సులక్షణసారములో నక్కడక్కడ టీకావివరణాలుగలవు. ఇవి వ్యావహారిక భాషలోనున్నవి. తిమ్మకవియే వీనినిరచించియుండునని వేఱుగఁ జెప్పనవసరములేదు. కస్తూరి రంగకవి వీనిలోఁ గొన్నిటిని గ్రాంథికములోనికి మార్చినాఁడు ఉదాహరణము:-

తిమ్మకవి టీక:- శ్రీకారం బెటువలెనంటె- శవర్ణ, రేఫ, ఈకారములు కూడగా శ్రీకారమాయెను. అందు శవర్ణరేఫలకు గ్రహంచంద్రుడు. కనుక ఈకారానకు గ్రహం సూర్యుడు. వారిద్దరి కన్యోన్యమైత్రి, కనుక శవర్ణ ఈకారములకధి దేవత లక్ష్మి. రేఫకు అగ్ని దేవత. అయితేనేమి అగ్ని లక్ష్మిమప్రియుండు. ఇందుకు సమ్మతి- (లక్షణ. సా. వ 220).

కస్తూరి రంగకవి-

శవర్ణమును ఈకారమును రేఫయును గూడిన శ్రీకారమయ్యెను. అందు శవర్ణ రేఫలకుఁ జంద్రుఁడుగ్రహము. ఈకారమునకు సూర్యుఁడు గ్రహము; గనుక వారికిద్దఱికి నన్యోన్యమైత్రి. ఈకారశవర్ణముల కధి దేవత లక్ష్మిదేవి, రేఫ కధిపతియగ్ని-

(ఆనం రం. ఛం. వ 142)

